తోటికోడలు వచ్చినప్పటినుంచీ యీావుదంతం అడపాదడపా చూస్తూనేవుంది. ఇవాళ ఆమె సహించలేదు. రాజమ్మను గట్టిగా చీవాట్లుపెట్టింది. రాజమ్మ కళ్ళనీళ్లు పెట్టుకొని ఆవిడ ఇంతింతలేసి మాటలంది, అని తల్లితోటి చెప్పింది. "ఏమిటమ్మా, ఏమిటేమిటో అన్నావుట? నా కూతురు రంకు సాగిస్తున్నాదా? నీ చెల్లెలేంచేసింది"—ఇలాగా వాగ్వాదం పెరిగింది. పెద్దకోడలు పరంధామయ్య దగ్గరకెళ్ళి చూశారా, ఏమండోయ్, మీామరదలు ఇలా యిలా అన్నది, ఈ ఇంట్లో నే వుండలేను బాబోయ్, అని రాగాలు తీసింది. రెండో ఆవిడొచ్చి మనం వెళ్ళిపోదామండీ, చేసిన చాకిరీ చాలును అని భీమయ్యతోటి మొరపెట్టుకుంది. పూర్వమయితే పరంధామయ్యా, భీమయ్యా ఎవరి భార్యలను వారు వెనకేసుకొని యిద్దరూ పోట్లాడుకునేవారు. ఇప్పుడు ఇద్దరూ తమతమ అర్థాంగులకు హితబోధ చేశారు. పడుచు జీతగాడు పడమటింట్లోకి రావటంలేదు. గొడ్లసావిట్లోకి రాజమ్మ పోవటంలేదు.

అన్నదమ్ములు మరీ శ్రద్ధగా చూడటం మొదలెట్టారు అన్నను. ప్రొద్దుటనే భీమయ్యవచ్చి లేవదీసి మొహమూా అదీ కడిగి పక్కమార్చి పోయేవాడు. రామయ్యవచ్చి కాఫీయిచ్చి, తరువాత గంట గంటకూ మందు కలిపిచ్చి పోయేవాడు. తోటికోడళ్ళు పూర్వపంతటి ఆప్యాయత చూపుకోక పోయినా, ముభావంగా ఎవరిపనులు వారు చేసుకుంటున్నారు.

పరంధామయ్యకు వుధృతంగా గుండె పోటు వచ్చింది. డాక్టరును పిలుచుకొచ్చాడు రామయ్య. డాక్టరు పెదవివిరిచాడు. భీమయ్యా రామయ్యా వాదినెదగ్గరకు పోయి "విల్లురాయించవద్దుటమ్మా" వదినా అన్నారు. పెద్ద తోటికోడలు మాట్లాడలేదు. ఊళ్ళోని జనమంతావచ్చి చూసిపోతున్నారు. భీమయ్యకూ రామయ్యకూ, ఆత్రుత ఎక్కువైంది. "విల్లు యిదివరకే రాశారుగా" అంది పెద్ద తోటికోడలు. రామయ్యా భీమయ్యా కుప్ప కూలిపోయారు. పరంధామయ్య ప్రాణాలు పంచభూతాల్లో కలసిపోయినాయి. "తన భార్యకు దత్తతచేసుకునే అధికారమిస్తూ సగమాస్తి భార్యకు, తక్కువదాంట్లో సగం దత్తుడికి, తక్కినది కూతురికి" రాసిచ్చి పోయాడు పరంధామయ్య. దగాపడ్డ తమ్ములు వీలునామాచూసుకొని దిగాలుపడ్డారు.

కథానిక

# కలకాలంలో శ్రీహరి

"భాస్కరం - ప్రభాకరం"

"కథంతా విన్నతరువాత అబ్సర్డ్ అనకండి. నమ్మితే నమ్మండి: లేకపోతేలేదు. ఈ ప్రపంచంలో ఏదీ అసంభవంకాదు ఆ మాటకొస్తే" అని కంఠశోషపడుతున్నాడు శేషు.

"నమ్ముతాం, చెప్పరాబాబూ, చంపక" అని మొత్తుకున్నాడు టార్జాన్.

"సిసలైన శ్రోతవంటే నువ్వేరా" అని వాణ్ణి మెచ్చుకున్నాడు శేషు.

శేషు చెప్పిన కథ సారాంశం యిది—

* * *

క్రాస్‌వర్డ్ పజిల్సువచ్చి చాలాకాలం అయినా ఇంత జగత్ప్రసిద్ధి ఎప్పుడూ పొందలేదు. ప్రతీవీధి చివరా కాష్ రసీదులు అమ్మేసెంటరూ, ఒకపెద్ద కర్రపెట్టె—ఇందులో వేస్తారు సమాధానాలు—. ప్రతివాడి చేతులో వొకపజిలు.

"ఇంత జూదపు తత్వం సమాజంలో ఎలా బయలుదేరింది?" అనే విషయంలో తర్జనభర్జనలు పడుతున్నారు వాటర్ లిలీ క్లబ్బుమెంబర్లు.

డబ్బు వుత్తినేవొచ్చి తమ ముందు వాలాలనే కోరిక మాత్రమే జూదానికి ఆధారమని అంతా నిర్ణయం చేసుకున్నారు. ప్రతివాడూ తను ఇన్నిసార్లుగా సొల్యూషన్స్ పంపడం, డబ్బుపోవడమే గాని రావడం ఎప్పుడూ ఎరగకపోవడం గురించి బల్లగుద్ది లెక్చరిచ్చి ఇది కూడదన్నాడు. ఇది సామాన్య మానవుడి జీవితానికి అపరోధం అని నొక్కి వక్కాణించి, ఇక నెవరూ ఎప్పుడూ వీటికి

సమాధానాలు పంపకపోవడమే సమాజ రక్షణకీ దేశక్షేమానికీ శుభప్రదమనీ తీర్మానించారు.

ఆ జనంలో శ్రీహరి కూడావున్నాడు. తను కూడా పజిల్సు కడుతూండేవాడు. ఎప్పుడూ ఒకదమ్మిడీ ఐనా కళ్ళజూసిన పాపానపోలేదు, ఈ పజిల్సువల్ల.

"నిజమే, వెధవపజిల్సు" అనుకున్నాడు శ్రీహరి.

శ్రీహరి ఆలోచిస్తున్నాడు. పజిల్సు పంపిస్తున్నప్పుడు ఎప్పుడూ తనకి సందేహంగానే వుండేది. కాని ఈ మాటుమాత్రం తనసొల్యూషన్ 'ఆల్ కరెక్ట్'నే దృఢ విశ్వాసం తనకుంది.

"కుక్క కనబడ్డప్పుడు రాయిదొరకదు; రాయి కనబడ్డప్పుడు కుక్కదొరకదు; రెండూదొరికితే అది రాజుగారికుక్క అయింది" అని ఒక సామెతవుంది. అల్లావుంది తనపని. సొమ్మున్నప్పుడు ఎన్ని ఎంట్రీలు కట్టినా 'కీ సొల్యూషన్' రాదు. 'కీ సొల్యూషన్' వచ్చిందని ఇప్పుడు తను అనుకుంటున్నాడా, సొమ్ములేదు!

పోనీలే అని యీ మాటు పజిల్ సొల్యూషన్ కట్టలేదనుకో తీరా కీసొల్యూషన్ పబ్లిష్ అయిన అయిన తరవాత తను గిలగిలా కొట్టుకోవాలి. 'అయ్యో లక్షొయాభైవేలు పోయాయే!' అని. సిరి వొస్తూంటే మోకాలొడ్డటమంటే ఇదే!

శ్రీహరి ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

చీకటిపడింది. |వొం తెనమీద నుంచున్నాడు శ్రీహరి. శ్రీహరికి నిర్ధనుడి బ్రతుకు వ్యర్థం అనిపించింది. "దారుణమీ దరిద్రము..." అనే పద్యం గుర్తొచ్చింది. చేతులో ఐదురూపాయలుంటే లక్షొయాభైవేల రూపాయలు గలగలలాడ్తాయి!

రాత్రిళ్ళు మంచు దట్టంగా కురుస్తోంది. ఆకాశంలో నక్షత్రాలు మినుకుమినుకు మంటున్నాయి. చంద్రుడింకా రాలేదు. "చలివేస్తోంది పోదాం" అనుకున్నాడు శ్రీహరి.

"బాలరాజూ, బాలరాజూ!"

తెల్లబోయాడు శ్రీహరి. శ్రీహరిని స్నేహితులంతా "బాలరాజూ!" అని పిలుస్తారు. అతని మీసాలవల్లనే అతనికాపేరు వచ్చిందనుకుంటాను.

మంచులో అవతలవ్యక్తి సరిగ్గా ఆనటంలేదు. ఆలోచిస్తున్న శ్రీహరి పరధ్యానంగా అనుకున్నాడు 'ఇంతచనువుగా పిలుస్తున్నాడు వీడెవరూ' అని.

"బాలరాజూ, బాలరాజూ!"

"ఎవరు వారు?"

"నేను...నిన్ను నేనెరుగుదును బాలరాజూ! నువ్వు నన్ను మరిచిపోయావేమో!"

ముసలిగొంతుకలా వినబడుతోంది. వీడెవడు?

"న్యూస్ పేపరు కొంటావా బాలరాజూ? నువ్వు కొనాల్సిన పేపరు, చాలా ముఖ్యమైనది."

"ఈవేళప్పుడు న్యూస్ పేపర్ల అమ్మకమేమిటి? పైగా నాకు చాలా ముఖ్యమట!" విసుక్కున్నాడు శ్రీహరి.

"అలా అనకు. ఇది బుధవారం పేపరు, క్రిందటి బుధవారంకాదు, పై బుధవారం పేపరు!"

అంత విసుగులోనూ నవ్వుకున్నాడు శ్రీహరి. రాబోయే బుధవారం పేపరుట! తనపేరు తెలుసుకుని మరీ తమాషావేస్తున్నాడు ముసలాడు.

"నీకేం కావాలి? అణా ఇవ్వండి బాబూ అని అడుగు, యిస్తాను. కల్లబొల్లి కబుర్లు చెప్పి టోపీ వెయ్యడానికి ప్రయత్నించకు!" అన్నాడు సీరియస్‌గా.

"కల్లబొల్లి కబుర్లుకావు. ఇష్టముంటే కొను, కష్టమయితే మానెయ్. నిన్ను ముష్టెత్తడానికి రాలేదు నేను. అణా ధర్మంచేసే వుదారుడివి అణా పేపరు కొనలేకపోవు!" అన్నాడు ముసలివాడు కరుకుగా.

ఇప్పుడు శ్రీహరి ముసలాడికేసి చూశాడు. ఒళ్ళంతా రగ్గు కప్పుకున్నాడు, నెత్తిమీద కోతి టోపీలాంటిది పెట్టుకున్నాడు. చీకటి...మంచు... మనిషి ఆకారం స్పష్టంగా కనిపించడంలేదు.

తను ఏదో ఆలోచించుకుంటూంటే మధ్య ఈ పిడకల వేటేమిటి? ఒక అణా యిచ్చి కాగితం పుచ్చుకుంటే వొదిలిపోయు!

పేపరు తీసుకుని అణా యిచ్చేశాడు శ్రీహరి. ముసలాడి చెయ్యి మంచుగడ్డలా చల్లగావుంది.

"వెళ్ళొస్తా బాలరాజూ!" ముసలాడు నవ్వుతూ అన్నాడు. అని నవ్వాడు.

ఆ నవ్వు మామూలుగా లేదు.

చిరాకుపడ్డాడు శ్రీహరి. ముసలాడు ఎక్కడా కనబడలేదు. చీకటి...ఎటుపోయాడోమరి.

విసురుగా హోటలు కెళ్ళి భోంచేశాడు. హోటలు యజమాని యథావిధిగా పాత బాకీ గుర్తుచేశాడు. ఇంకెందుకు, జీతంరాగానే పై నెల అడ్వాన్సుకూడా కట్టేస్తానని వాగ్దానంచేశాడు. హోటలు యజమాని "అల్లాగేలెండి" అని నసుక్కున్నాడు అపనమ్మకంగా.

చలిచలిగా వుంది. రూముకి చేరుకున్నాడు. లైటు వెలిగించి సిగరెట్లకోసం వెతుకుతున్నాడు. బల్లమీద రేపు వొదలగొట్టవలసిన ఫైళ్ల దొంతర వుంది. సిగరెట్లు కనబడలేదు.

సిగరెట్లు జేబులోనే వున్నట్టు గుర్తొచ్చింది. జేబులోంచి ప్యాకెట్టు తీశాడు. ప్యాకెట్టుతో పాటు ఇందాకా కొన్న న్యూస్ పేపరుకూడా కింద పడింది. పరధ్యానంగా దీపంముందు కూర్చుని చదువుతున్నాడు శ్రీహరి.

క్రమంగా పరధ్యానం ఆశ్చర్యంగా మారింది. నోట్లోంచి సిగరెట్టు జారిపడింది. సోమవారం రిలీజవబోయే సినిమా విమర్శ ఇందులోవుంది! ఒక్క సినిమాయేకాదు, రాజకీయాలూ... అన్నీ.

ఆశ్చర్యం!

ఉలిక్కిపడ్డాడు శ్రీహరి. పేపరు చేత్తోపట్టుకుని నుంచున్నాడు. బుధవారంనాడు ప్రచురితమవవలసిన "పజిల్ కీ సొల్యూషన్" ఇందులోవుంది!

శ్రీహరి ఆశ్చర్యానికి అంతులేదు! గబగబ కోటు జేబులోంచి తను పూర్తిచేసిన కీ సొల్యూషన్ తీశాడు. తనవి నాలుగు తప్పులు ఈ "కీ సొల్యూషన్" ప్రకారం.

ఇంకా సమయం మించిపోలేదు. రేపు సాయంకాలంవరకూ వుంది! ఎక్స్‌ప్రెస్ డెలివరీ కవరు మెయిల్లో లేట్ ఫీజ్ కట్టి పడేస్తే రేపు సాయంకాలానికల్లా అందిపోతుంది. వెంటనే పంపిస్తే లక్షా యాభైవేలు!

మళ్ళీ అనుమానంగానే వుంది. తీరాచేసి ఇది అబద్ధమేమో! ఇల్లా ఆ ముసలాడు ఎంతమందికి అమ్మాడో ఎంతమంది అప్పుడే కట్టేశారో!

అయినాసరే శ్రీహరి తుదినిర్ణయానికొచ్చాడు. తనరాసిన మొదటి ఎంట్రీ ఈ పత్రికలో ప్రకటించిన ఎంట్రీ మొత్తం రెండు ఎంట్రీలే పంపుతాడు, చూస్తాడు!

"ఎల్లావుందో నసీబు" అనుకున్నాడు శ్రీహరి. పత్రికలోంచి కీ సొల్యూషన్ కాపీ చేశాడు. మెయిలుకింకా గంట టైముంది!... తను ముందు పంపిన సొల్యూషన్‌కూడా దాంతో జతచేశాడు. ముసలాడు అమ్మిన పత్రిక జేబులో పెట్టుకు బయలుదేరాడు.

బల్లమీద ఫైళ్ళదొంతర తనకేసి చూస్తోంది "బాలరాజూ, రేపుమధ్యాహ్నానికల్లా ఫైళ్లు సబ్మిట్ చెయ్యకపోతే నీవు వుద్యోగం గాన్‌ఫట్" అన్నట్టు.

"షోశ్" అనుకున్నాడు "బాలరాజు." లక్షా యాభయ్‌వేలు రావాలిగానీ, వొస్తే ఎవడుచేస్తాడీ వెధవ వుద్యోగం!

ఏం తిరిగాడో, ఏం యాతనపడ్డాడో, మెయిలు వేళకి ఎంట్రీలు అందించి ఇంటికొచ్చి హాయిగా నిద్దరపోయాడు శ్రీహరి.

కలలో ఇంద్రధనస్సులు కనపడ్డాయి శ్రీహరికి.

* * *

బుధవారంపొద్దున్న ఆఫీసుఫైళ్ళలో మునిగి వుండగా టెలిగ్రాం వచ్చింది శ్రీహరికి.

"టెలిగ్రాంరోయ్" అన్నాడు ఫ్రెండ్సు.

"పజిల్సునుంచిరోయ్" అన్నారు ఫ్రెండ్సు!

పజిల్సునుంచే? అవును ఈవేళ బుధవారం ఈవేళనే టెలిగ్రాంరావాలి! వచ్చింది!

ఫ్రెండ్సు టెలిగ్రాం పైకి చదివారు.

శ్రీహరికి గుండె ఆగినంత పనైంది! తనకి డెబ్భై అయిదు వేలు బహుమానం వచ్చింది. రెండో బహుమానం మద్రాసులో మొహినుద్దీన్ అనే అత్తరు వ్యాపారస్థుని కొచ్చింది.

శ్రీహరికి కళ్లు తిరుగుతున్నాయి. తను ఎప్పుడూ ఊహించలేనంత పెద్ద మొత్తం తన చేతుల్లోకి వస్తుంది! డెబ్బయ్యయిదు వేలు! డెబ్బయ్ అయిదు వేల రూపాయిలు!

కూజాలోంచి గ్లాసుడు మంచినీళ్ళు స్నేహితు లందిస్తే తాగి కూర్చీలో ఓరగిలబడి కళ్లు మూసుకున్నాడు శ్రీహరి.

టెలిగ్రాం చూసిన స్నేహితులంతా ప్రళయంగా కేకలేస్తూ సంతోషించారు, అది ఆఫీసన్న విష

యమే వాళ్లు మరిచిపోయినట్లుగా. ఆఫీసరుగారికి ఎవరు చెప్పారోకాని, "కంగ్రాచులేషన్స్ మిస్టర్ శ్రీహరి" అంటూ ఆయనకూడా గుమాస్తాలగదిలోకి పరుగెత్తుకు వచ్చారు.

వాళ్ళు తెలియకుండా తాగిన వాడికి ఎంత కైపుగా వుంటుందో, అంత మత్తుగానూ పడి వున్నాడు శ్రీహరి. సిగరెట్టు వెలిగించాడు.

"టీపార్టీరోయ్!" అన్నాడు కృష్ణమూర్తి.

"డిన్నరురోయ్!" అన్నాడు రామశాస్త్రి.

"సినీమారోయ్!" అన్నాడు సుబ్బారావు.

"మూడుమ్రోయ్" అన్నాడు కల్లూరి వీర వెంకటసత్యనారాయణమూర్తి.

"ఇంక గుమాస్తాగిరికి గుడ్ బై కాబోలు" అన్నాడు నిరాశగా రామన్.

శ్రీహరికి ఏమీ వినపట్టంలేదు...ఏమీ కన పడటం లేదు...అలాగే కళ్ళు మూసుకొని సిగరెట్టు పీలుస్తున్నాడు.

"ముందు మనం శ్రీహరికి పార్టీ యివ్వాలి" అన్నారు ఆఫీసరుగారు.

పొలోమని బయలుదేరా రంతా.

* * *

సాయంకాలం అయేసరికి దండలు చేత్తో పట్టుకొని స్నేహితు లందరితో సిటీ బస్సులో సినిమాకి పోతున్నాడు శ్రీహరి.

మధ్యాహ్నం టీపార్టీలూ ఫొటోలూ, పుష్ప మాలాలంకరణలూ, అభినందనలూ, కృతజ్ఞతా ప్రకటనలూ అన్నీ అయిపోయాయి. శ్రీహరి ఏభయ్‌రూపాయిలు ఆఫీసరుగారి దగ్గర అప్పుగా తీసుకున్నాడు, విందులకీ వినోదాలకీ ఖర్చుపెట్ట డానికి సిటీ బస్సులో బయలుదేరారు సినిమా చూడడానికని.

శ్రీహరి తన సీటులో కూర్చున్నాడు. మొదట కలిగిన ఎక్సైట్‌మెంటు ఇప్పుడు లేకపోయినా, అంతకు మించిన కలవరంగావుంది అతనిహృదయం.

ఎవరా ముసలివాడు? తనని వెతుక్కుంటూ వాడెందుకొచ్చి యిచ్చి వెళ్ళాడు? వాడు తనని ఎలా ఎరుగును? అంత చనువుగా పిలిచాడే?

మానవాతీతమయిన శక్తులమీద శ్రీహరికి నమ్మకంలేదు. పేరు శ్రీహరే అయినా శ్రీహరి మాత్రం ఆస్తికుడుకాడు.

మరి ఎవరాముసలివాడు? ఎవరావ్యక్తి? కలకాదు. ప్యాంటు జేబులో అతడిచ్చిన పేపరు ఇంకా వుంది కావలిస్తే.

వెంటనే జేబులోంచి కాగితం తీశాడు. స్నేహితులంతా కులాసాగా కబుర్లు చెప్పుకుంటు న్నారు బస్సులో. మూర్తి ఆఫీసరుగారిదగ్గర చేరాడు.

పరధ్యానంగా అన్ని కాలములూ చూస్తున్న శ్రీహరి మొహం, వెలవెలబోయింది...హఠాత్తుగా అతని చేతులు వొణుకుతున్నాయి..."తాజా వార్తలు" కింద అతనికొక వార్త కనబడింది.

"సిటీబస్సులో యువకుని దుర్మరణం:

తంగిరాల శ్రీహరి అనబడే కలక్టరాఫీసులోని గుమాస్తా ఈరోజు సాయంకాలం స్నేహితులతో సినిమాకి వెడుతూ బస్సులో గుండె ఆగి మరణిం చాడు. మధ్యాహ్నం ఇతనికి 75 వేలరూపాయిల బహుమానం క్రాస్‌వర్డ్ పజిల్సులో వచ్చిందనీ, అదే ఈయనకి హఠాత్తుగా గుండె ఆగటానికి కారణమనీ డాక్టర్లు అభిప్రాయ పడుతున్నారు."

ముసలివాడినవ్వు శ్రీహరి గుండెల్లో మ్రోగింది. కెవ్వుమని కేకపెట్టి ముందుకి వాలిపోయాడు శ్రీహరి. చేతులోంచి కాగితం జారి కింద పడింది.

"బాలరాజూ!"

"అదేమిట్రా, బాలరాజూ!"

స్నేహితులంతా గొల్లుమన్నారు. బస్సుఆగింది. స్నేహితులు సాయంపట్టి శ్రీహరిని బస్సులోంచి దింపారు. మంచినీళ్ళు మొహంమీద చల్లారు.

మంచినీళ్ళు పట్టించబోతే గుటకపడలేదు!

డాక్టరుకోసం ముగ్గురు స్నేహితులు ఖంగా రుగా మూడు వైపులకి పరుగెత్తారు.

శ్రీహరిని దింపే కంగారులో, శ్రీహరి చేతు లోంచి జారిన పేపరు రోడ్డుమీద పడిపోయింది.

గాలికి బహుశా కాగితం ఎగిరిపోయి వుంటుంది.

* * *

అంతావిని ఐదునిముషాలు నిశ్శబ్దంగాకూర్చున్న తరవాత "అబ్సర్డ్!" అని అరిచాడు టార్జాన్.

(ఇంగ్లీష్ కథ ఆధారంగా)